
B9 NEWS
నిజం - మా ఇజం

మన.. ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం...



PUBLISHED FROM: Telangana & Andhrapradesh | సంపుటి : 01 | సంచిక : 270 | గురువారం | 29-10-2026 | ఎడిటర్ : పులిజ్వాల చంద్రకాంత్ | పేజీలు : 08 | వెల : 05/-



కరవు మండలాల జాబితా అశాస్త్రీయం

- తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన కరవు మండలాల జాబితాపై బండి సంజయ్ విమర్శలు
- కరవు మండలాల జాబితా అశాస్త్రీయమన్న బండి సంజయ్
- కరీంనగర్ పార్లమెంట్ పరిధికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపణ
- 35 శాతం వర్షపాతం లోటు ఉన్న మండలాలను కూడా విస్మరించారని ఆగ్రహం

2

మన ప్రజాపక్షం,హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన కరవు మండలాల జాబితాపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో విమర్శలు

ఏపీని వణికిస్తున్న అర్నబ్ తుపాను..

వేర్వేరు ఘటనల్లో 7 మంది మృతి

- అర్నబ్ తుపాను కారణంగా ఏపీలో విషాద ఘటనలు
- రాష్ట్రవ్యాప్తంగా వేర్వేరు ఘటనల్లో ఏడుగురు మృతి
- కరెంట్ స్తంభాలు, చెట్లు కూలి పలువురి దుర్మరణం
- విశాఖ, పశ్చిమగోదావరి, కోనసీమ, అనకాపల్లి జిల్లాల్లో మరణాలు

2

కరవును ఎదుర్కొనేందుకు అఖిలపక్ష సూచనల మేరకు

చర్యలు తీసుకుంటాం



2

మన ప్రజాపక్షం,హైదరాబాద్

కరవును ఎదుర్కొనేందుకు అఖిలపక్ష సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రకృతి విపత్తును అధిగమించేందుకు సానుకూల, నిర్మాణాత్మక వైఖరితో ముందుకు వెళ్లతామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం, రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన ఎల్‌నినో కారణంగా తెలంగాణలో నెలకొన్న కార్యాచరణపై, కరవు పరిస్థితులను ఎదుర్కొనేదెలా అనే అంశంపై అఖిలపక్ష భేటీలో చర్చించారు.ఉత్తమ్ కుమార్ రెడ్డి కరవు పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం సానుకూల, నిర్మాణాత్మక దృక్పథంతో ముందుకు సాగుతుందని ఉత్తమ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు వ్యక్తం చేసిన ఆందోళనలను ప్రభుత్వం శ్రద్ధగా ఆలకించినట్లు పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర నదీజలాల అంశాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను, రాష్ట్ర రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, కరవు పరిస్థితులు, వాటివల్ల ప్రజలు, రైతులపై పడే ప్రభావాన్ని తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలిపారు.

రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది



ఏపీకి అండగా తెలంగాణ

తుపాను వేళ ఏపీకి అండగా తెలంగాణ ప్రభుత్వం...

సాయానికి సిద్ధమన్న భట్టి

- ఉత్తరాంధ్రను అతలాకుతలం చేసిన అర్నబ్ తుపాను విపత్తులో ఏపీకి సాయం చేసేందుకు
- ముందుకొచ్చిన తెలంగాణ ప్రభుత్వం
- ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫోన్ చేసిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- విద్యుత్ పునరుద్ధరణ పనులకు సిబ్బంది, సామగ్రి పంపుతామని హామీ
- తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి గొట్టిపాటి
- ఇప్పటికే సహాయక చర్యల కోసం 6,000 మంది సిబ్బందిని మోహరించిన ఏపీ ప్రభుత్వం

2

మన ప్రజాపక్షం,హైదరాబాద్

అర్నబ్ తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు సహాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఏపీలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు, ముఖ్యంగా విద్యుత్ పునరుద్ధరణ పనులకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి

బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు.. కాంగ్రెస్ ఖాతా తెరిచిందా?

మోదీ సెటైర్

- నాలుగు రాష్ట్రాల్లో 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఉపఎన్నికలు
- 12 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్
- కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కని వైనం
- ఎన్నికలు బ్యాలెట్ పత్రాలతో జరిగాయని గుర్తుచేసిన ప్రధాని మోదీ
- మోనోకిల్ ఎమోజీతో కాంగ్రెస్‌పై మోదీ సెటైర్

మన ప్రజాపక్షం,ఢిల్లీ



2

నాలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క స్థానాన్నీ గెలుచుకోలేకపోయింది. ఈ ఫలితాలపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యంగ్యంగా స్పందించారు.

ప్రభుత్వ సేవల్లో ఏఐ

తెలంగాణలో 'ఏఐ సాక్షమ్' కార్యక్రమం ప్రారంభం

'ఏఐ సాక్షమ్' కార్యక్రమాన్ని ప్రారంభించిన మల్లు భట్టి విక్రమార్క

రైతులు, పింఛనుదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి మారాలన్న డిప్యూటీ సీఎం

ప్రజల డేటా భద్రతకే అత్యధిక ప్రాధాన్యమని వెల్లడి

మన ప్రజాపక్షం,హైదరాబాద్



2

తెలంగాణలో ప్రభుత్వ సేవలను మరింత వేగవంతం, పారదర్శకం చేసే లక్ష్యంతో ప్రభుత్వం 'ఏఐ సాక్షమ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచేందుకు ఉద్దేశించిన ఈ కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హైదరాబాద్‌లో

టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నారు

మోదీ, అమిత్ షాలపై రాహుల్ గాంధీ ఫైర్

- టాటా గ్రూప్‌ను నేరపూరితంగా నాశనం చేస్తున్నారన్న రాహుల్ గాంధీ
- మోదీ, అమిత్ షాలపై తీవ్ర విమర్శలు
- భయంతోనే వ్యాపారవేత్తలు మౌనంగా ఉన్నారని ఆరోపణ

2

మన ప్రజాపక్షం,ఢిల్లీ



లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ టాటా గ్రూప్‌పై సంచలన ఆరోపణలు చేశారు. టాటా సంస్థను 'నేరపూరితంగా నాశనం' చేస్తున్నారని, అయినా దేశంలోని



కేటీఆర్ పాస్‌పోర్ట్ వివాదం..

యథాతథ స్థితి కొనసాగించాలన్న హైకోర్టు

- ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌కు తాత్కాలిక ఊరట
- ఏసీబీ, పాస్‌పోర్ట్ అధికారులకు కోర్టు నోటీసుల జారీ
- కేసు తదుపరి విచారణ నవంబర్ 6కు వాయిదా

2

రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది

కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ రావు ధ్వజం

- మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా బీఆర్ఎస్ నేతలను దిగ్బంధించారన్న హరీశ్
- కరవుతో అల్లాడుతున్న రైతులను ఆదుకోవడం చేతకాని ప్రభుత్వమని విమర్శ
- ప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్న



2

మన ప్రజాపక్షం,హైదరాబాద్

మూసీ నది ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు హాజరుకాకుండా బీఆర్ఎస్ నేతలను గృహనిర్బంధం చేశారని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. రాష్ట్రంలో

ప్రతిచోటా దెయ్యాలే కనిపిస్తున్నాయా?'..

రాహుల్‌కు నిర్మల ఘాటు కౌంటర్

- టాటా వ్యవహారంపై రాహుల్ గాంధీ ఆరోపణలు
- రాహుల్‌కు నిర్మలా సీతారామన్ కౌంటర్
- ప్రతిచోటా దెయ్యాలను వెతకొద్దంటూ చురకలు
- వ్యాపార అంశాలను రాజకీయాల్లోకి లాగొద్దని హితవు
- కాంగ్రెస్ లైసెన్స్-కోటా విధానంపై విమర్శలు



2

మన ప్రజాపక్షం,ఢిల్లీ

టాటా గ్రూప్ వ్యవహారం ఇప్పుడు రాజకీయ దుమారం రేపుతోంది. ఆ సంస్థను

All are Continues Second Page

ఏపీకి అండగా
తెలంగాణ

మొదటి పేజీ తరువాయి

విక్రమార్క బుధవారం ఆంధ్రప్రదేశ్ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తుపాను తీవ్రత, ఏపీలో జరిగిన నష్టం గురించి భట్టి విక్రమార్క ఆరా తీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో నష్టాన్ని తగ్గించడానికి, వీలైనంత త్వరగా పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి చేపడుతున్న చర్యలను మంత్రి గొట్టిపాటి ఆయనకు వివరించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, ప్రజల భద్రత కోసం తీసుకుంటున్న ప్రత్యేక చర్యల గురించి తెలిపారు. ఈ కష్టకాలంలో ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. విద్యుత్ పునరుద్ధరణ పనుల కోసం అవసరమైతే సిబ్బందిని, అవసరమైన సామగ్రిని పంపడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ హామీతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు మరింత వేగవంతం అవుతాయని భావిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం అందించిన సహాయ హస్తానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో అండగా నిలుస్తామన్న భట్టి విక్రమార్కకు, తెలంగాణ ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఈ సహకారం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అంతకుముందు, తుపాను సహాయక చర్యల కోసం ఏపీ ప్రభుత్వం ఇప్పటికే సుమారు 6,000 మంది అనుభవజ్ఞులైన సిబ్బందిని రంగంలోకి దించినట్లు గొట్టిపాటి తెలిపారు. తుఫాను పునరుద్ధరణ పనుల్లో అనుభవం ఉన్న అధికారులు, ఫీల్డ్ సిబ్బందిని అత్యవసర సేవల కోసం సిద్ధం చేశామన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో డైరెక్టర్ల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఆయన వివరించారు.

బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు..
కాంగ్రెస్ ఖాతా తెరిచిందా?

మొదటి పేజీ తరువాయి

బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరిగాయని గుర్తుచేస్తూ, కాంగ్రెస్ ఎన్ని స్థానాలు గెలిచిందో ఊహించాలంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనికి 'మోనోకిల్' ఎమోజీని జతచేశారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, కర్ణాటక రాష్ట్రాల్లో మొత్తం 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఉపఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ 12 స్థానాల్లో పోటీ చేసింది. గతంలో ఆ పార్టీ గెలిచిన నాలుగు స్థానాలు కూడా ఈ ఎన్నికల్లో ఉన్నాయి. అయినా ఈసారి ఒక్క చోటా విజయం సాధించలేకపోయింది. కర్ణాటకలో అధికారంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్‌కు సీటు దక్కకపోవడం గట్టి ఎదురుదెబ్బగా మారింది. ఈ ఫలితాలను ప్రస్తావిస్తూ మోదీ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఓటింగ్ యంత్రాల్లో అక్రమాలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ గతంలో ఆరోపణలు చేసింది. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించాలని కూడా కోరింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్ పత్రాలతోనే జరిగాయని మోదీ గుర్తుచేశారు. అయినా కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదంటూ పరోక్షంగా ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలో ఎమర్జెన్సీ
పాలన నడుస్తోంది

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ తరహా పాలన సాగిస్తూ, ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. హైదరాబాద్‌లోని వాలంతరిలో మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ జరగాల్సి ఉంది. ఈ కార్యక్రమానికి హాజరుకావడానికి సిద్ధమైన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఆమె కుమారుడు కార్తీక్ రెడ్డిలను పోలీసులు శ్రీనగర్ కాలనీలోని వారి నివాసంలో గృహ నిర్బంధం చేశారు. తెల్లవారుజాము నుంచే వారి ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహరించి, బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఈ ఘటనపై హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. "కరవుతో రైతులు అల్లాడుతుంటే ఆదుకోవడం చేతకాని ప్రభుత్వం, రూ. 1.50 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన పేరుతో కమిషన్ల కోసం ప్రాజెక్టులు చేపడుతోంది" అని ఆరోపించారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ, ప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన ముసుగులో జరుగుతున్న దోపిడీ యత్నాలను తెలంగాణ సమాజం తిప్పికొడుతుందని, కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా అరెస్టులను ఖండించారు. ఇది అప్రజాస్వామిక చర్య అని, మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు అండగా నిలుస్తున్నందుకే తమను అక్రమంగా నిర్బంధించారని ఆరోపించారు. గృహనిర్బంధంలో ఉన్న బీఆర్ఎస్ నేతలను తక్షణమే విడుదల చేయాలని పార్టీ తరఫున డిమాండ్ చేశారు.

'ప్రతిచోటా దెయ్యాలే
కనిపిస్తున్నాయా?'..

మొదటి పేజీ తరువాయి

ఉద్దేశపూర్వకంగా దెబ్బతీస్తున్నారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఘాటుగా స్పందించారు. ప్రతి అంశాన్నీ రాజకీయ కోణంలో చూడొద్దని, వాణిజ్య, న్యాయపరమైన విషయాలను నేరాలుగా చిత్రీకరించడం సరికాదని హితవు పలికారు. 'ప్రతిచోటా దెయ్యాలను వెతకడం మానుకోండి' అంటూ ఎక్స్ వేదికగా చురకలంటించారు. టాటా గ్రూప్ తీవ్ర సంక్షోభంలో ఉందని, ఆ సంస్థను నేరపూరితంగా నాశనం చేస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వ్యవహారంపై వ్యాపార ప్రముఖులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. తమ దాకా వస్తే గానీ తెలియదా? అంటూ విమర్శించారు. భారత వ్యాపార రంగం ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల్లోని ఆటబొమ్మ కాదని వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలపై న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు. రాహుల్ వ్యాఖ్యలపై స్పందించిన నిర్మలా సీతారామన్.. భారత పరిశ్రమలు, పారిశ్రామికవేత్తల విజయాలను కాంగ్రెస్ పదేపదే తక్కువ చేసి చూపుతోందని విమర్శించారు. వ్యాపార రంగంలో అవిశ్వాసం, విషపూరిత వాతావరణం వ్యాప్తి చేసేందుకు రాహుల్ ప్రయత్నిస్తున్నారా? అని ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ పాలనలోని లైసెన్స్-కోటా విధానం పారిశ్రామికవేత్తల స్వేచ్ఛను దెబ్బతీసిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి కల్పనకు ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు. టాటా సన్స్ ఛైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్‌ను మరో ఐదేళ్లపాటు కొనసాగించాలన్న నిర్ణయంపై వివాదం నెలకొంది. సెప్టెంబర్ 17న జరిగిన బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని టాటా ట్రస్ట్స్ చైర్మన్ నోయెల్ టాటా సవాల్ చేశారు. ఆ నిర్ణయం చెల్లదని, నిబంధనల ప్రకారం జరగలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు.

టాటా గ్రూప్‌ను
నాశనం చేస్తున్నారు

మొదటి పేజీ తరువాయి

వ్యాపారవేత్తలు భయంతో నోరు మెదపడం లేదని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆయన ఒక పోస్ట్ చేశారు. "భారతీయ వ్యాపార రంగం మోదీ, అమిత్ షాల ఆటవస్తువు కాదు. మీకు ధైర్యం లేదు, మాకుంది. ఈ నేరాలకు న్యాయం జరిగేలా చూస్తాం" అని రాహుల్ తన పోస్టులో పేర్కొన్నారు. టాటా గ్రూప్‌లో కొంతకాలంగా నడుస్తున్న అంతర్గత వివాదం నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ పునర్‌నియామకాన్ని టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా సవాలు చేశారు. సెప్టెంబర్ 17న జరిగిన బోర్డు తీర్మానం చెల్లదని, నియామక ప్రక్రియలో నిబంధనలు పాటించలేదని ఆయన అక్టోబర్ 26న రాసిన లేఖలో ఆరోపించారు. ఈ వివాదం కార్పొరేట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, రాహుల్ ఆరోపణలపై బీజేపీ నేత సీఆర్ కేశవన్ స్పందించారు. రాహుల్ గాంధీకి ఆర్థికశాస్త్రంపై అవగాహన లేదని విమర్శించారు.

కరవు మండలాల జాబితా అశాస్త్రీయం

మొదటి పేజీ తరువాయి

గుప్పించారు. ఈ జాబితా అత్యంత అశాస్త్రీయంగా, పక్షపాత ధోరణితో ఉందని ఆయన ఆరోపించారు. కేవలం మొక్కుబడిగా ఈ జాబితాను తయారు చేశారని మండిపడ్డారు. ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గానికి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని బండి సంజయ్ అన్నారు. 35 శాతం వర్షపాతం లోటు ఉన్న మండలాలను కూడా జాబితాలో చేర్చకపోవడం ప్రభుత్వ ఉద్దేశాన్ని స్పష్టం చేస్తోందన్నారు. హుస్నాబాద్, వేములవాడ, సిరిసిల్ల, మానకొండూరు, చొప్పదండి, హుజూరాబాద్ నియోజకవర్గాల్లోని తీవ్ర కరవు పరిస్థితులు ప్రభుత్వానికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. పంట పొలాలు బీళ్లుగా మారినా, ప్రజలు తాగునీటి ఎద్దడితో అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నష్టపరిహారం ఖర్చులు తప్పించుకోవాలనే ఉద్దేశంతోనే కరీంనగర్‌ను ఉద్దేశపూర్వకంగా విస్మరించారా? అని ఆయన నిలదీశారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి రైతులతో మాట్లాడితేనే కరవు తీవ్రత స్పష్టంగా తెలుస్తుందని సూచించారు. కరవు మండలాలను ఏ ప్రాతిపదికన, ఏ గణాంకాల ఆధారంగా గుర్తించారో తెలుపుతూ ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి మండలానికి వర్షపాతం లోటు, సాగు విస్తీర్ణం, పంట నష్టం, భూమిలో తేమ వంటి అంశాలను విడివిడిగా పరిశీలించి, అర్హులైన అన్ని మండలాలను జాబితాలో చేర్చాలని కోరారు. ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

కేటీఆర్ పాస్‌పోర్ట్ వివాదం..

మొదటి పేజీ తరువాయి

ఫార్ములా ఈ రేస్ నిధుల మళ్లింపు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావుకు తెలంగాణ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ఆయన పాస్‌పోర్ట్‌కు సంబంధించి జారీ అయిన నోటీసుల విషయంలో యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఫార్ములా ఈ కేసులో విచారణ జరుపుతున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), కేటీఆర్ పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయానికి (ఆర్‌పీవో) లేఖ రాసింది. ఏసీబీ అభ్యర్థన మేరకు పాస్‌పోర్ట్ అధికారులు కేటీఆర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను సవాలు చేస్తూ కేటీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం, పాస్‌పోర్ట్ నోటీసుల ప్రక్రియలో యథాతథ స్థితిని పాటించాలని ఆదేశించింది. ప్రతివాదులుగా ఉన్న ఏసీబీ, పాస్‌పోర్ట్ అధికారులకు నోటీసులు జారీ చేస్తూ, వారి వాదనలను కౌంటర్ అఫిడవిట్ రూపంలో సమర్పించాలని సూచించింది. అనంతరం, కేసు తదుపరి విచారణను నవంబర్ 6వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో కేటీఆర్ పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకునే ప్రక్రియకు ప్రస్తుతానికి అడ్డుకట్ట పడినట్లయింది.



ఏపీని వణికిస్తున్న
అర్నబ్ తుపాను..

మొదటి పేజీ తరువాయి

ఏపీలో అర్నబ్ తుపాను విషాదాన్ని మిగిల్చింది. తుపాను ప్రభావంతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఈ క్రమంలో చోటుచేసుకున్న వేర్వేరు ఘటనల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నారు. వివరాల్లోకి వెళితే, విశాఖపట్నంలో రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మరణించారు. పాత గోశాల సమీపంలో విద్యుత్ స్తంభం కూలి ఒకరు మృతి చెందగా, సింహాచలం బాలాజీనగర్‌లో బిందు అనే వివాహిత ప్రాణాలు కోల్పోయారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోనూ ఇద్దరు మృత్యువాత పడ్డారు. చర్చి వద్ద చెట్టు విరిగిపడటంతో చొక్కా కిశోర్ (45), బొండాడవారి వీధిలో కరెంట్ స్తంభం పడటంతో రాంబాబు (34) దుర్మరణం చెందారు. ఇక, కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదికర ప్రకాశ్ పురంలో ఓ వృద్ధురాలు మరణించారు. పెను గాలులకు గుడిసె కూలిపోవడంతో కొల్లు వెంకాయమ్మ అనే మరో వృద్ధురాలు మరణించారు. అదేవిధంగా అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలో విద్యుత్ షాక్‌కు గురై మరో మహిళ మృతి చెందారు. పలు జిల్లాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరగడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది.

కరవును ఎదుర్కొనేందుకు అఖిలపక్ష సూచనల మేరకు
చర్యలు తీసుకుంటాం

మొదటి పేజీ తరువాయి

తాగునీటి సరఫరా, నీటి వనరుల పరిరక్షణ, సాగునీటికి విద్యుత్ సరఫరా, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, కరువు నివారణకు ముందస్తు చర్యలు వంటి కీలక అంశాలపై అఖిలపక్ష నాయకుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించినట్లు వివరించారు. తదుపరి కార్యాచరణను నిర్ణయించే సమయంలో వారి అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఈ ప్రకృతి విపత్తు కారణంగా ఎదురవుతున్న సవాళ్లను నిర్మాణాత్మక దృక్పథంతో పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. నదీజలాల అంశాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను, తెలంగాణ రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న సవాళ్లు, ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వారు చర్చించారు. పలు పార్టీల నేతలు హాజరు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క, వాకిటి శ్రీహరి, చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు, ఎల్‌నినో నోడల్ అధికారి రామకృష్ణారావులు హాజరయ్యారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేత అంజన్‌కుమార్ యాదవ్, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వినోద్‌కుమార్, ఎల్.రమణ, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బీజేపీ ప్రతిపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కొమురయ్య, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ, ఎంఐఎం ప్రతిపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ప్రొఫెసర్ సింహాద్రి, వెంకటేశ్వర్లు, ఆర్జేడీ నాయకురాలు శోభ యాదవ్, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు శ్రీరామ్ కృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు హేమ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు



జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటిన జెడ్పీహెచ్ఎస్ పేంబర్తి విద్యార్థిని ఉషశ్రీ

జనగామ, మన ప్రజాపక్షం:
జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో జెడ్పీహెచ్ఎస్ పేంబర్తి పాఠశాలకు చెందిన విద్యార్థిని బిర్రు ఉషశ్రీ అద్భుత ప్రతిభ కనబరిచి, బహుళ విభాగాల్లో పతకాలు సాధించి పాఠశాలకు మరియు జిల్లాకు గొప్ప పేరు తెచ్చారు. క్రీడల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఉషశ్రీ క్యారమ్స్ పోటీల్లో 'ప్రథమ బహుమతి', షాట్ పుట్ విభాగంలో 'ద్వితీయ బహుమతి', అలాగే రన్నింగ్ పోటీల్లో 'తృతీయ బహుమతి' సాధించి తన సర్వతోముఖ ప్రతిభను చాటుకున్నారు. ?ఒకే పోటీలో వివిధ విభాగాల్లో పాల్గొని మూడు పతకాలను కైవసం చేసుకోవడం పట్ల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు మరియు స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా విజేతగా నిలిచిన బిర్రు ఉషశ్రీని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు మరియు పాఠశాల సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. ఈ విజయంతో పేంబర్తి గ్రామంతో పాటు పాఠశాల పేరు జిల్లా స్థాయిలో మారుమోగిందని, భవిష్యత్తులో ఆమె జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.?నిరంతరం కఠోర శ్రమ, పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని ఉషశ్రీ ఈ విజయంతో నిరూపించిందని, రాబోయే రోజుల్లో మరింత ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించాలని అందరూ కోరుకుంటున్నారు.

ఇష్టరీతిగా పార్కింగ్ డబ్బులు వసూల్...!?

రషీదు అడిగితే దురుసుగుగా సమాధానం!
నాగర్ కర్నూల్ శ్రీ రమణ థియేటర్ నిర్వాకం!

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీ రమణ సినిమా థియేటర్ లో బైక్, కారు పార్కింగ్ కు సంబందించి వారి ఇష్టం వచ్చినట్టు డబ్బులు వసూలు చేస్తున్నారని, వసూలు చేస్తున్న డబ్బులకు రషీదు అడిగితే రషీదు ఉండదు, రషీదు ఇవ్వము అని దురుసుగా సమాధానం చెప్తున్నారని సినీ ప్రియులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్కింగ్ విషయంలో థియేటర్ వారు ఎటువంటి నియమ నిబంధనలు పాటించకుండా అంతా తమ ఇష్టరీతిలో వ్యవహరిస్తూ సామాన్య సినీప్రియుల జేబులను కొల్లగొడుతున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రశ్నించినవారిని తమదైన రీతిలో బెదిరిస్తూ, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని,ఎక్కడ ఫిర్యాదు చేసుకుంటారో చేసుకోండని దురుసుగా సమాధానం ఇస్తున్నారని పలువురు తెలిపారు. జిల్లా అధికారులు శ్రీ రమణ థియేటర్ పై విచారణ జరిపి కఠినమైన చర్యలు తీసుకోవాలని సినీప్రియులు కోరుతున్నారు.







పోలీస్ అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం!

జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్

నారాయణపేట, మన ప్రజాపక్షం:
పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు-2026 సందర్భంగా నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ నేతృత్వంలో భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీలో పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ప్రజలు, వివిధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని "జోహార్ పోలీస్ అమరవీరులకు.. జోహార్ జోహార్!" అంటూ నినాదాలు చేస్తూ అమరవీరులకు ఘన నివాళులర్పించారు. దేశ రక్షణ, ప్రజా భద్రత కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం అన్నారు.వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజా రక్షణకు పునరంకితం కావాలని ఎస్పీ పిలుపునిచ్చారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని, యువత దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని సూచించారు.

సోలార్ ప్యానెళ్ల ఏర్పాటులో కొండారెడ్డిపల్లి ఆదర్శం

ప్రతి ఇంటికీ సౌర విద్యుత్ సదుపాయం కల్పించి 100 శాతం సోలార్ గ్రామంగా తీర్చిదిద్దాలి
జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

నాగర్‌కర్నూల్,మన ప్రజాపక్షం:
జిల్లాలోని బల్మూర్ మండలం కొండారెడ్డిపల్లి గ్రామాన్ని మోడల్ సోలార్ విలేజ్‌గా అభివృద్ధి చేస్తూ ప్రతి ఇంటికీ సోలార్ ప్యానెళ్ల ద్వారా సౌర విద్యుత్ సదుపాయం కల్పించేందుకు చేపడుతున్న చర్యలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పేర్కొన్నారు. కొండారెడ్డిపల్లిని 100 శాతం సోలార్ గ్రామంగా తీర్చిదిద్దడం ద్వారా సంప్రదాయ విద్యుత్‌పై ఆధారపడటాన్ని తగ్గించడంతోపాటు,పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారుబుధవారం బల్మూర్ మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పర్యటించారు.ఈ సందర్భంగా గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు, అంగన్‌వాడీ కేంద్రం, గృహాలపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెళ్లు, గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆయా పనుల పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలేపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను పరిశీలించారు. కొండారెడ్డిపల్లి గ్రామంలో గృహాలపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెళ్లను పరిశీలించిన కలెక్టర్, ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఇప్పటివరకు సుమారు 101 ఇళ్లపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు వివరించారు. తెలంగాణ రెడ్కో భాగస్వామ్యంతో గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌర విద్యుత్ సదుపాయం కల్పించేందుకు చర్యలు చేపట్టడం పట్ల జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.మిగిలిన ఇళ్లపై కూడా సోలార్ ప్యానెళ్ల ఏర్పాటును వేగవంతం చేసి, గ్రామాన్ని పూర్తిస్థాయి సోలార్ గ్రామంగా అభివృద్ధి చేయాలని సూచించారు. నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లకు సైతం త్వరితగతిన సోలార్ కనెక్షన్లు కల్పించేలా చర్యలు



తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అనంతరం గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఎల్లమ్మ, పార్వతమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పరిశీలించారు. నిర్మాణ పనుల ప్రస్తుత స్థితి, ఇప్పటివరకు లబ్ధిదారులకు అందిన బిల్లులు, పెండింగ్‌లో ఉన్న బిల్లుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు రూ.3.40 లక్షల మేర బిల్లులు అందాయని, మరో బిల్లు పెండింగ్‌లో ఉందని అధికారులు వివరించారు. పెండింగ్ బిల్లులను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్మాణ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, కేంద్రం నిర్వహణ, పిల్లల సంరక్షణకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంతోపాటు, వారి ఆరోగ్యం, ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పిల్లల పోషకాహార స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, వారికి అవసరమైన సేవలు సక్రమంగా అందేలా చూడాలని తెలిపారు.ఈ సందర్భంగా చిన్నారులతో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆప్యాయంగా ముచ్చటించారు. వారి పేర్లను అడిగి తెలుసుకుంటూ, వారితో కొద్దిసేపు సరదాగా గడిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు మెరుగైన వాతావరణం కల్పిస్తూ, వారి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.గ్రామంలో రూ.20 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పరిశీలించారు. ఇప్పటివరకు సుమారు 70 శాతం పనులు పూర్తయ్యాయని, మరో రెండు నెలల్లో భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, పనుల్లో జాప్యం జరగకుండా నిర్దేశిత గడువులోగా భవనాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.గ్రామ పంచాయతీ భవనం పూర్తయితే స్థానిక ప్రజలకు అవసరమైన పరిపాలనా సేవలు మరింత సులభంగా అందించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్ణీత సమయంలో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

భూ రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి

అనంతరం బల్మూర్ మండలం పోలేపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూముల వివరాల సేకరణ, సర్వే ప్రక్రియ, భూ రికార్డుల నమోదు తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూ రీ సర్వేను డిజిటల్ విధానంలో వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.క్షేత్రస్థాయిలో భూముల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, రికార్డుల్లో ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని,భూ వివరాల నమోదు విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తూ సర్వే ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ వెంట బల్మూర్ మండల తహశీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ శాఖ, పశు వైద్య శాఖ, విద్యాశాఖలకు చెందిన సంబంధిత అధికారులు, టీజీ రెడ్కో అధికారులు, గ్రామ సర్పంచ్ రాధాకృష్ణ, గ్రామ ఉపసర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ కార్మికుల గుర్తింపు, విముక్తి, పునరావాసానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
నాగర్‌కర్నూల్ జిల్లాలో వెట్టిచాకిరీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు, బాధిత కార్మికులను గుర్తించి విముక్తి కల్పించడంతోపాటు వారికి పునరావాసం అందించి, వారి హక్కులను పరిరక్షించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశించారు.వెట్టిచాకిరీ కార్మికుల గుర్తింపు, విముక్తి, ఆర్థిక సహాయం, పునరావాసం తదితర అంశాలపై బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లోని కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించి, బాధితులకు అందుతున్న ప్రభుత్వ సహాయంపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సమీక్షించారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఏర్పడిన అనంతరం ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 161 మంది వెట్టిచాకిరీ కార్మికులను గుర్తించి, వారికి విముక్తి కల్పించినట్లు సమావేశంలో లేబర్ అధికారి రాజ్ కుమార్ వెల్లడించారు. వీరిలో 71 మందికి ప్రభుత్వం ద్వారా పూర్తి స్థాయిలో ఆర్థిక సహాయం అందించినట్లు అయన కలెక్టర్ కు తెలిపారు. మరో 26 మందికి తాత్కాలికంగా రూ.5 వేల చొప్పున



ప్రాథమిక ఆర్థిక సహాయం అందించగా, ఒక్కొక్కరికి మిగిలిన రూ.15 వేల చొప్పున సహాయం అందించాల్సి ఉందని వివరించారు. అదేవిధంగా మరో 64 మంది విముక్తి పొందిన కార్మికులకు ఆర్థిక సహాయం అందించాల్సి ఉందని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ అర్హులైన బాధితులందరికీ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సహాయం అందించడంలో జాప్యం జరగకుండా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వెట్టిచాకిరీకి గురవుతున్న కార్మికులను గుర్తించి, వారిని ఆ దోపిడీ నుంచి విముక్తి కల్పించడంతోపాటు అవసరమైన చట్టపరమైన రక్షణ కల్పించాలని సూచించారు. విముక్తి పొందిన కార్మికులు తిరిగి వెట్టిచాకిరీలోకి వెళ్లకుండా వారికి జీవనోపాధి అవకాశాలు కల్పించడం, పునరావాస పథకాల ప్రయోజనాలు అందించడం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.వెట్టిచాకిరీకి సంబంధించిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని, బాధితులకు అవసరమైన ప్రభుత్వ సహాయం, న్యాయ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వెట్టిచాకిరీ నిర్మూలనలో కార్మిక శాఖతోపాటు రెవెన్యూ, పోలీసు, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖలు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, బ్యాంకింగ్ తదితర విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. బాధితుల వివరాలను సమగ్రంగా సేకరించి, అర్హత మేరకు వారికి అందాల్సిన ప్రయోజనాలను సకాలంలో అందించేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య, జిల్లా కార్మిక శాఖ అధికారి రాజ్ కుమార్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజి, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి ఉమాపతి, ఆర్డీవోలు అర్చన జనార్దన్ రెడ్డి, బన్సీలాల్ , కలెక్టరేట్ సి సెక్షన్ సూపరింటెండెంట్ రవికుమార్, షీ టీం ఎస్సై విజయ, సీసీఎస్ సీఐ శంకర్‌తోపాటు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి
పర్యాటక శాఖకు చెందిన 16 అభివృద్ధి పనులను ఆర్ అండ్ బీ శాఖకు బదిలీ చేయాలి
జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
నాగర్ కర్నూల్ జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి సంబంధించి సుమారు రూ.40.06 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న కొల్లాపూర్ నియోజకవర్గం పరిధితో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో చేపట్టనున్న 16 అభివృద్ధి పనులను పర్యాటక శాఖ నుంచి రోడ్లు, భవనాల శాఖ (ఆర్ అండ్ బీ)కు వెంటనే బదిలీ చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో పర్యాటక, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లాలో చేపట్టిన పర్యాటక అభివృద్ధి పనులు, కొత్తగా అభివృద్ధి చేయనున్న పర్యాటక ప్రాంతాలకు సంబంధించిన అంశాలపై అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నాగర్ కర్నూల్ జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తూ పలు చర్యలు చేపడుతోందని, జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను గుర్తించి, వాటి అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.పర్యాటకులను ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందించి, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా జిల్లాలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.పర్యాటక అభివృద్ధి పనులు వేగవంతంగా ముందుకు సాగేందుకు సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని, పర్యాటక శాఖకు చెందిన 16 పనులను ఆర్ అండ్ బీ శాఖకు బదిలీ చేసేందుకు అవసరమైన చర్యలను తక్షణమే చేపట్టాలని ఆదేశించారు.



నాగర్ కర్నూల్ జిల్లాలో పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా పర్యాటక రంగానికి మరింత ప్రోత్సాహం కల్పించేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.పర్యాటక అభివృద్ధికి అవసరమైన పనుల బదిలీ తదితర అంశాలపై ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా టూరిజం డిఈలు పరుషవేది, శ్రీనివాస్ రెడ్డి, ఏఈఈ నాగార్జున గౌడ్, పంచాయతీ రాజ్ డిఈ విజయ్ కుమార్, జిల్లా టూరిజం శాఖ అధికారి కల్వరాల నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లు బకాయిలు వెంటనే చెల్లించాలి

బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు
జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిల విషయంలో రైస్ మిల్లర్లు నిర్లక్ష్యం వహించకుండా వెంటనే బకాయిలను చెల్లించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ స్పష్టం చేశారు. బకాయిల చెల్లింపులో జాప్యం చేస్తూ ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోని మిల్లర్లపై నిబంధనల ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. ప్రభుత్వానికి రావాల్సిన బకాయిల వసూళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సూచించారు.బుధవారం సాయంత్రం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు బి.చెన్నయ్య, దేవ సహాయంలతో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లాలోని రైస్ మిల్లర్లకు సంబంధించిన ప్రభుత్వ బకాయిల వివరాలు, బకాయిల చెల్లింపు పరిస్థితి, రానున్న సీజన్లలో సన్న బియ్యం కొనుగోళ్లకు చేపట్టాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలను సకాలంలో చెల్లించడం ప్రతి మిల్లర్ బాధ్యత అని కలెక్టర్ తెలిపారు. బకాయిలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండకుండా సంబంధిత మిల్లర్లు తక్షణమే స్పందించాలని సూచించారు. బకాయిల వసూళ్ల విషయంలో అధికారులు నిర్దిష్ట కార్యాచరణతో ముందుకు సాగాలని, చెల్లింపులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జీవో నంబర్ 17 ప్రకారం పెండింగ్ బకాయిలను పూర్తిగా చెల్లించేందుకు 45 రోజుల గడువు విధించింది. నిర్ణీత గడువులోగా బకాయిలను నగదు రూపంలో చెల్లించాలని లేదా బకాయిలకు సమానమైన బియ్యాన్ని ప్రభుత్వానికి అందజేయాలని రైస్ మిల్లర్లకు ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసిందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.45 రోజుల గడువులోగా బకాయిలను పూర్తిగా చెల్లించని రైస్ మిల్లర్లపై రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. అవసరమైతే సంబంధిత మిల్లర్ల ఆస్తులను జప్తు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. బకాయిల వసూళ్లలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాబోయే సీజన్‌లో డిఫాల్ట్ రైస్ మిల్లర్లకు బియ్యం కేటాయింపులు జరగాలంటే ముందుగా వారు తమ పెండింగ్ బకాయిలను పూర్తిగా చెల్లించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలను సకాలంలో చెల్లించి, తదుపరి సీజన్‌లో ఇబ్బందులు ఎదురుకాకుండా చూసుకోవాలని రైస్ మిల్లర్లకు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల అమలులో భాగంగా బకాయిల వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. గడువులోగా బకాయిలు చెల్లించని మిల్లర్లపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా



ఉందని తెలిపారు. ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలను వసూలు చేయడంలో ఎలాంటి జాప్యం జరగకూడదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. బకాయిలు చెల్లించాల్సిన మిల్లర్ల వివరాలను పరిశీలించి, చెల్లింపుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. బకాయిల చెల్లింపుపై మిల్లర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వానికి బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యం చేసే మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకునే విషయంలో వెనుకడుగు వేయబోమని కలెక్టర్ హెచ్చరించారు. బకాయిల సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు మిల్లర్లు సహకరించాలని సూచించారు.ప్రభుత్వ బకాయిలను వెంటనే చెల్లించి, తదుపరి చర్యలకు అవకాశం లేకుండా సహకరించాలని, బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం వహించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ హెచ్చరించారు.ఈ సమావేశంలో ఇన్చార్జి సివిల్ సప్లై అధికారి హైదర్ అలీ, డిఎం సివిల్ సప్లై రాజేందర్, పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పీఎం శ్రీ పాఠశాలల జిల్లాస్థాయి
క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి
డీఈఓ రమేష్ కుమార్

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకొని, తమలోని ప్రతిభను వెలికితీసి ఉన్నతస్థాయికి ఎదగాలని నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రమేష్ కుమార్ సూచించారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతోపాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని డిఇఓ తెలిపారు.నాగర్ కర్నూల్ జిల్లాలోని 24 పీఎంసీ పాఠశాలలకు చెందిన బాలబాలికల కోసం నాగర్ కర్నూల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. రెండు రోజులపాటు నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించారు. కబడ్డీ, వాలీబాల్‌తోపాటు 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల పరుగుపందాలు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, త్రోబాల్ తదితర క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా డీఈఓ రమేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిలో క్రీడలకు ప్రత్యేక



స్థానం ఉందన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన పోటీతత్వం పెరుగుతుందని, జట్టుగా పనిచేసే లక్షణం అలవడుతుందని వివరించారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. ప్రతి విద్యార్థి చదువుకు ప్రాధాన్యత ఇస్తూనే క్రీడల్లోనూ తన ప్రతిభను నిరూపించుకోవాలని అన్నారు. పాఠశాల స్థాయి నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకుంటే భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణించే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు భవిష్యత్తులో మరింత కృషి చేసి ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.అనంతరం వివిధ క్రీడా విభాగాల్లో విజయం సాధించిన విద్యార్థులను డీఈఓ అభినందించి, విజేతలకు మెమెంటోలు అందజేశారు. అండర్-17 బాలుర వాలీబాల్ విభాగంలో లింగాల్ రెసిడెన్షియల్ హైస్కూల్ ప్రథమ బహుమతి సాధించగా, అంబటిపల్లిలోని జెడ్పీహెచ్ఎస్ ద్వితీయ బహుమతి సాధించింది.బాలికల వాలీబాల్ విభాగంలో కల్వకుర్తిలోని ఎంజెపి పాఠశాల ప్రథమ బహుమతి సాధించగా, ఇనోల్‌లోని రెసిడెన్షియల్ పాఠశాల ద్వితీయ బహుమతి దక్కించుకుంది.జిల్లాస్థాయి పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయులు, పాఠశాలల సిబ్బంది అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు నిరంజన్ యాదవ్, రమేష్, వెంకటయ్య, పాండు, యాదయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.





జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూల్ ఆధ్వర్యంలో బుధవారం నాడు తాడూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు సురక్షిత్ బచ్పన్ అభియాన్-ఏ పాన్ ఇండియా స్కూల్ అవగాహన క్యాంపెయిన్ గురించి విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది.ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిహారిక సెక్రెటరీ డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నాగర్ కర్నూల్ హాజరై మాట్లాడుతూ సురక్షిత్ బచ్పన్ అభియాన్ అనేది భారతదేశంలో పిల్లల రక్షణ, హక్కులు మరియు వారి భద్రతను పెంపొందించడం కోసం ఉద్దేశించిన ఒక ముఖ్యమైన కార్యక్రమం అన్నారు. 6 సంవత్సరాల వయస్సు నుంచి 14 సంవత్సరాల వయస్సు మధ్య ఉన్న బాల బాలికలు అందరూ తప్పనిసరిగా పాఠశాలకు వెళ్ళి చదువుకోవాలి అన్నారు. పిల్లలకు సైబర్ నేరాలు, డ్రగ్స్ తీసుకోవడం వల్ల జరిగే నష్టాల గురించి వివరించడం జరిగింది.ఆడ పిల్లలపై జరిగే లైంగిక దాడులు, వేధింపులను అడ్డుకోవడం కోసం ఏర్పాటైన పోక్సో చట్టంపై పాఠశాలల్లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. పాఠశాల విద్యార్థులకు గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ గురించి వివరించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో శ్రీరామ్ ఆర్య గవర్నమెంట్ లాయర్, శ్రీశైలం గౌడ్ డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఎం పోరాట ఫలితంగా అచ్చంపేట కరువు మండలంగా గుర్తింపు

హర్షం వ్యక్తం చేసిన సీపీఎం మండల కార్యదర్శి వర్ధం సైదులు



అచ్చంపేట,మన ప్రజాపక్షం: సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటాలు, రైతుల పక్షాన చేసిన ఆందోళనల ఫలితంగా అచ్చంపేట మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా గుర్తించడం పట్ల సీపీఎం మండల కమిటీ హర్షం వ్యక్తం చేసింది.వర్షాభావ పరిస్థితులతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితి నెలకొందని సీపీఎం మండల కార్యదర్శి వర్ధం సైదులు తెలిపారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని పార్టీ నిరంతరం పోరాడిందన్నారు.కరువు నిబంధనల ప్రకారం అర్హులైన రైతులందరికీ నష్టపరిహారం అందించాలని, పంట రుణాల విషయంలో తగిన చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో సహకరించిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణకు సీపీఎం మండల కమిటీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.రైతులకు న్యాయం జరిగి, ప్రభుత్వ సహాయం అందే వరకు సీపీఎం పార్టీ వారి పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని వర్ధం సైదులు స్పష్టం చేశారు.



డ్రైవింగ్ చేస్తూ ఆకస్మాత్తుగా గుండెపోటుతో మృతి

జనగామ, మన ప్రజాపక్షం:
పట్టణంలోని సిద్దిపేట ఫ్లైఓవర్ పై నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో బోడ లింగయ్య మరణించాడు. మృతుడు బచ్చన్నపేట మండలం ఇటకాలపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. గుండెపోటుకు గురైన లింగయ్యకు తోటి వాహనదారులు సిపిఆర్ చేసిన ఫలితం లేకపోయింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిది

కేతేపల్లి,మన ప్రజాపక్షం:
ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని కేతేపల్లి మండల విద్యాధికారి కొచ్చర్ల బిక్షమయ్య మరియు గ్రామ సర్పంచ్ చిముట పద్మా వెంకన్న యాదవ్ అన్నారు. బుధవారం కేతేపల్లి మండలం భీమారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-90 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు సుమారు రూ.17 వేల విలువైన మైక్ సెట్‌ను అందజేశారు. అదేవిధంగా మిర్యాలగూడ పట్టణానికి చెందిన తాటికొండ రామ్మూర్తి- పుష్పలత దంపతులు తమ కుమారుడి జ్ఞాపకార్థం సుమారు రూ.5 వేల విలువైన డ్రమ్స్‌ను పాఠశాలకు అందించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి కొచ్చర్ల బిక్షమయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతులు కల్పిస్తూ పేద విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న దాతలను అభినందించారు. తాము చదువుకున్న పాఠశాలను మరచిపోకుండా, పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. దాతలు ఇదే స్ఫూర్తితో



ముందుకు వచ్చి సహకరిస్తే విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు కల్పించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిముట పద్మ వెంకన్న యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కూడా అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు సహకరించాలని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చింతమల్ల అంజయ్య, నందిగామ అరవింద్ శర్మ, బచ్చలికూరి



సైదులు, గూడపురి జానయ్య, సంద పాపయ్య, సోమగాని కొండయ్య, కురెల్లి వెంకన్న, జె.నారాయణ, పి.ఆంధ్రయ్య,గునగంటి రాము, పాఠశాల ఉపాధ్యాయులు కన్నె శివయ్య, బత్తుల జానకిరెడ్డి, గుమ్మడవల్లి రమేష్, లగిశెట్టి శ్రీధర్, మ్యాదమ్ శేఖర్, పీడీ దోరెపల్లి నాగయ్య, రాపోలు పరమేష్, ఇందిర, సహాయ మేరీ, అటెండర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

నీరు, విద్యుత్తును పొదుపుగా వినియోగించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచన



ఉప్పునుంతల,మన ప్రజాపక్షం:
మండలంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు, తీవ్రమైన ఎండలు, నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు ముందస్తు చర్యలు చేపట్టాలని అచ్చంపేట ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సూచించారు.ఉప్పునుంతల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న నెలల్లో తాగునీరు, సాగునీరు, విద్యుత్తు సమస్యలు తలెత్తకుండా ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు.గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాతో పాటు బోర్ల పనితీరును అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడా తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవిలో విద్యుత్తు డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నందున అవసరమైనప్పుడే విద్యుత్తును వినియోగించాలని, అనవసరంగా లైట్లు, విద్యుత్ పరికరాలను ఆన్‌లో ఉంచవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.అలాగే వివిజిరాంజి పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఎక్కువ పనిదినాలు కల్పించి ఉపాధి అవకాశాలు పెంచాలని అధికారులను కోరారు. ప్రకృతి వైపరీత్యాలు, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అర్నబ్ తుఫాన్ బీభత్సం.... నేలకొరిగిన వరి పంటలు



చిలుకూరు,మన ప్రజాపక్షం:
చిలుకూరు మండల వ్యాప్తంగా అర్నబ్ తుఫాన్ ప్రభావంతో భారీ గాలులు, వర్షాలకు వందలాది ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది.కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట పూర్తిగా నేలకొరగడంతో రైతులు తీవ్ర ఆందోళన కు గురవుతున్నారు. దాదాపు వంద ఎకరాలకు పైగా ఇదే పరిస్థితి నెలకొంది.మోటర్లు సక్రమంగా నడకపోయినా అష్ట కష్టాలు పడి వరి పంట సాగు చేస్తే తీరా పంట చేతికి వచ్చే సమయంలో తుపాను ప్రభావంతో పంట నష్టం జరగడంతో అన్నదాతలు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు.



పెట్టుబడి పెట్టి సాగు చేసిన కౌలు రైతులకు ఈ నష్టం మరింత భారంగా మారింది పంట నీటిలో మునిగి, రంగు మారి, దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని తుఫాన్ వల్ల నష్టపోయిన పంటను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో క్రీడాకారులకు బహుమతుల ప్రదానోత్సవం

జనగామ, మన ప్రజాపక్షం:
జనగామ జిల్లా కేంద్రంలోని జూబ్లీ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ రక్షణ సేన యూత్ మరియు విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో క్రీడా పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గొరిగే నరసింహ కురుమ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు క్రీడలతో పాటు విద్యలోనూ రాణిస్తూ తమ భవిష్యత్తుకు మంచి పునాది వేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు నడిపెల్లి వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో మంచి నాయకులుగా ఎదిగి, దేశ సేవతో పాటు సమాజ సేవలోనూ కీలక పాత్ర పోషించాలని కోరారు.అనంతరం ఆసర్ల సుభాష్ మాట్లాడుతూ యువత, విద్యార్థులు కష్టపడి చదువుకుని విద్యారంగంలో, ఉపాధి రంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అసంతుల ఆంజనేయులు, బండారు సుమన్, యాకన్న, మైనారిటీ విభాగం అధ్యక్షులు మహమ్మద్ ఇమ్రాన్, ఎస్సీ విభాగం అధ్యక్షులు ఎడమ సుమంత్ తేజ, సర్దార్ విభాగం అధ్యక్షులు సంసర్ సింగ్, బీసీ విభాగం కార్యదర్శి మేడిచర్ల ఉదయ్ కుమార్, ఓబీసీ ప్రధాన కార్యదర్శి నామాల కర్ణాకర్ గౌడ్, కళ్లెపు సురేష్ కుమార్, రమేష్, విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.క్రీడాకారులను ప్రోత్సహించడం, యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడం, విద్యార్థులను సామాజిక బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కుల వివక్షత సామాజిక అసమానతలు తొలగినప్పుడే దేశాభివృద్ధి సాధ్యం

జనగామ, మన ప్రజాపక్షం:సంత్ శిరోమణి గురు రవిదాస్ 650వ జయంతి ఉత్సవాల సందర్భంగా జనగామ జిల్లాలోని వివిధ గ్రామాల గ్రామ పెద్దల ఆత్మీయ సమ్మేళనం జిల్లా కేంద్రం కెమిస్ట్రీ భవన్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన "సామాజిక సమరసత వేదిక" జాతీయ సాంస్కృతిక విభాగ కన్వీనర్ అప్పాల ప్రసాద్ జీ మార్గదర్శనం చేశారు. జనగామ, లింగాల గణపురం మండలంలోని గ్రామాల నుండి వచ్చినటువంటి వివిధ కుల సంఘాల పెద్దలతో నిర్వహించిన ముఖాముఖీ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అంటరానితనం వివక్షత గ్రామాల్లో తొలగినప్పుడే జాతీయ సమైక్యతకు అంకురార్పణ జరుగుతుందని వారు అన్నారు. గ్రామాల్లో పెద్దలు కలిసి కూర్చుని దేవాలయాల ప్రవేశము అలాగే అన్ని హిందువుల యొక్క పండుగలు అసమానతలు లేకుండా జరుపుకోవాలని సూచించారు.నేడు గ్రామాలలో వివిధ కుల సంఘాల పెద్దలు తమ సామాజిక కుటుంబీకుల అభివృద్ధికి తోడ్పడుతూ వివిధ సామాజిక వర్గాలతో స్నేహభావంతో గ్రామంలో వివిధ కార్యక్రమాలు అన్ని సామాజిక వర్గాలతో ఉమ్మడిగా చేయడం జాతీయ సమైక్యతను ప్రతిబింబిస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో 25 గ్రామాల నుండి అన్ని కుల సంఘాల



ప్రతినిధులు విచ్చేసి తమ యొక్క అనుభవాలను వారు గ్రామంలో ఉమ్మడిగా నిర్వహిస్తున్నటువంటి కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. అప్పాల ప్రసాద్ మాట్లాడుతూ ఒకే దేశం ఒకే ప్రజా అనే నినాదంతో జాతీయస్థాయిలో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో అనేక చైతన్యవంతమైనటువంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోంది.భారతదేశంలో బ్రిటిష్ వారి రాకకు ముందు కుల వ్యవస్థ అనేది లేకుండా ప్రజలంతా ఉమ్మడిగా తమ తమ వృత్తులలో నైపుణ్యతను ప్రదర్శించుకుంటూ ఒకరి వృత్తికి మరొకరు సహకరించుకునేవారు, బ్రిటిష్ వారు విభజించు పాలించు అనే పద్ధతిలో భారత దేశంలో కుల వ్యవస్థకు ఆజ్యం పోసిన విషమ చరిత్ర బ్రిటిష్ పాలకవర్గానిది అని గుర్తు చేశారు. నేడు యువతలో కుల వివక్షత లేకుండా స్నేహ తత్వం ఆత్మీయతత్వం పెంపొంది అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతూ ఒకే దేశం ఒకే ప్రజా నినాదాన్ని ముందుకు తీసుకెళుతున్న యువతను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమానికి సమరసత వేదిక జనగామ జిల్లా అధ్యక్షులు నీలం స్వామి అధ్యక్షత వహించగా, కార్యక్రమ సమన్వయకర్తగా ఎస్ పి ఆర్ స్కూల్ కరెస్పాండెంట్ కీర్తి వీరేందర్ వ్యవహరించారు.కార్యక్రమ ఆర్గనైజర్లుగా పిట్టల సత్యం, అయిలా సోమ నరసింహచారి, మంగళంపల్లి రాజు, శ్రీనివాస్ వ్యవహరించారు. అన్ని గ్రామాల పెద్దలు జనగామ పట్టణ వివిధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనగా వారిని ఘనంగా సత్కరించారు.

అర్నబ్ తుఫాను ముప్పు- పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: మున్సిపల్ కమిషనర్

జనగామ, మన ప్రజాపక్షం:అర్నబ్ తుఫాను ప్రభావంతో రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు, ఈదురుగాలులు మరియు ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉన్నందున జనగామ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరూ తీవ్ర అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులు ఉంటే తప్ప ప్రజలు ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రాకూడదని, ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు మరియు అనారోగ్యంతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు వహించాలని సూచించారు. ?తుఫాను సమయంలో ప్రమాదాల నివారణకు ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కమిషనర్ కోరారు. వర్షాలు, ఈదురుగాలులు వీచే వేళల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్‌లు మరియు పాత భవనాల వద్ద నిలబడకూడదని స్పష్టం చేశారు.అలాగే నీరు నిలిచిన రహదారులు, లోతట్టు ప్రాంతాలు, నీటి ప్రవాహం ఉన్న కల్వర్టులు మరియు వంతెనలపై ప్రయాణాలు చేయవద్దని హెచ్చరించారు. తెగిపడిన విద్యుత్ తీగలను తాకకుండా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని, ఇళ్లలో తాగునీరు, నిత్యావసరాలు, అత్యవసర మందులు మరియు టార్చ్‌లైట్లను సిద్ధంగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. ?అత్యవసర సహాయం మరియు సమాచారం కోసం పట్టణ ప్రజలు మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ వి.గోపయ్యని (సెల్ నెంబర్: 9182620979) సంప్రదించాలని తెలిపారు. మున్సిపల్ మరియు పారిశుద్ధ్య సిబ్బంది సూచనలను పాటిస్తూ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను, ధృవీకరించని వార్తలను నమ్మవద్దని, కేవలం వాతావరణ శాఖ మరియు జిల్లా యంత్రాంగం జారీ చేసే అధికారిక ప్రకటనలనే గమనించాలని సూచించారు. ప్రజల ఆరోగ్య భద్రతే తమ ప్రధాన లక్ష్యమని, రానున్న 24 గంటలు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి మున్సిపల్ యంత్రాంగానికి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.



పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

ఘనంగా రక్తదాన శిబిరం-140 యూనిట్ల రక్తం సేకరణ

జనగామ, మన ప్రజాపక్షం:
పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం జనగామ పట్టణంలోని కామాక్షి ఫంక్షన్ హాల్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.జనగామ సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రాణదాన కార్యక్రమాన్ని వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ (ఐపీఎస్) ముఖ్య అతిథిగా హాజరై అధికారికంగా ప్రారంభించారు.

యువత, సర్పంచుల విశేష స్పందన

ఈ రక్తదాన శిబిరంలో స్థానిక యువకులు, వివిధ గ్రామాల సర్పంచులు పెద్ద సంఖ్యలో పాల్గొని అత్యంత



ఉత్సాహంతో రక్తదానం చేశారు. పోలీసు శాఖ పిలుపునకు స్పందించి సమాజ సేవే ధ్యేయంగా ముందుకు వచ్చిన దాతల నుంచి మొత్తం 140 యూనిట్ల రక్తాన్ని వైద్య సిబ్బంది సేకరించారు.

అమరవీరుల త్యాగాలు అమరం

శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, రక్తదానం లాంటి పవిత్ర కార్యం ద్వారా ఇతరుల ప్రాణాలను



కాపాడేందుకు ముందుకు రావడం అభినందనీయమని పోలీసు అధికారులు కొనియాడారు.ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన యువతకు, ప్రజాప్రతినిధులకు, ప్రజాసంఘాల నాయకులకు పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్‌ను కలిసిన ఎస్‌పీఎస్ జిల్లా కమిటీ

కాంట్రాక్ట్ సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలి

జనగామ, మన ప్రజాపక్షం
:జనగామ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. నాగమణిని బుధవారం మధ్యాహ్నం ఎస్‌పీఎస్ జనగామ జిల్లా కమిటీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నాగమణిని కమిటీ ప్రతినిధులు శాలువాతో ఘనంగా సత్కరించి, శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏనుగుల రఘు మాట్లాడుతూ మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బంది ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.ముఖ్యంగా ప్రస్తుతం అమల్లో ఉన్న బెడ్‌సైడ్ కాంటాక్ట్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే సిబ్బందికి లబ్ధి



చేకూరేలా హెచ్‌ఎఫ్‌ఎంఐఎస్ విధానం నుండి ఐఎఫ్‌ఎంఐఎస్ విధానంలోకి మార్పులు చేయాలని కోరారు.?ఆసుపత్రి మరియు కాలేజీలో విధుల్లో ఉన్న పేషెంట్ కేర్, సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది సమస్యలను పరిష్కరించడంతో పాటు, వారికి ప్రతి నెలా కనీస వేతనంగా రూ. 25,000 చెల్లించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.కాంట్రాక్ట్ ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి సంబంధిత ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించి చొరవ చూపాలని ఆయన ఆకాంక్షించారు. ?ఈ కార్యక్రమంలో ఎస్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు స్వామి, సునీత, రజిత, అఖిల, గోపాలకృష్ణ, స్వప్నతో పాటు పలువురు జిల్లా నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

పార్టీలో అంతా బీఆర్ఎస్ గ్రూపే..అందరిదీ కేసీఆర్ గ్రూపే..!

వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి పార్టీ విజయం కోసం పనిచేయాలి
ప్రతి గ్రామానికి కోఆర్డినేటర్లను నియమించి బాధ్యతలు అప్పగించాలి
ప్రతి గ్రామంలో అర్హులైన గ్రాడ్యుయేట్లను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించాలి
దరఖాస్తుల సమర్పణతో సరిపెట్టొద్దు.. ఆమోదం పొందే వరకు పర్యవేక్షించాలి
గ్రామాలవారీగా ఓటర్ల జాబితాలు సిద్ధం చేయాలి
కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటే ఎమ్మెల్సీ ఎన్నికలో గెలుపు కీలకం
ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై పార్టీ శ్రేణులకు పల్లా రాజేశ్వర్‌రెడ్డి దిశానిర్దేశం

జనగామ, మన ప్రజాపక్షం:
ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, ప్రతి గ్రామంలో అర్హులైన గ్రాడ్యుయేట్లను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించాలని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దరఖాస్తులు సమర్పించడంతోనే సరిపె ట్టుకోకుండా, వాటికి ఆమోదం లభించే వరకు బాధ్యతగా వ్యవహరిం చాలని సూచించారు. ఎన్నికలో విజయం సాధించాలంటే ఓటరు నమో దు ప్రక్రియ నుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తాటికొండ రాజయ్య ఆధ్వర్యంలో బుధవారం జనగామ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో లింగాలఘణపురం, రఘునాథపల్లి మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి నాగూర్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రాధాన్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ 2015లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన విషయాన్ని, 2021 ఎన్నికల సమయంలో ప్రతికూల పరిస్థితుల మధ్య పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాల్సి వచ్చిన సందర్భాన్ని పల్లా వివ రించారు. గ్రామాల్లో గ్రాడ్యుయేట్లు తక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ, వారి ద్వారా ఇతరులపై కూడా ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. అందు వల్ల ఈ ఎన్నికను సాధారణంగా తీసుకోకుండా పూర్తిస్థాయిలో కృషి చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో గతంలో జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలతోపాటు, కర్ణాటకలో జరిగిన గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను గుర్తుచేస్తూ ఎన్నికల్లో విజయాలు రాజకీయంగా కీలకమైనవని వివరించారు. ప్రతి ఎన్నికను సమర్థంగా ఎదుర్కొనేందుకు ముందస్తు సన్నద్ధత అవసరమన్నారు.ఓటరు నమోదు కార్యక్రమం పురోగతిపై


బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూడా ఆరా తీశారని పల్లా తెలిపారు. రాత్రి 11 గంటల సమయంలో ఫోన్ చేసి, ఇప్పటివరకు ఎంతమంది ఓటర్లను నమోదు చేయించారని, ఎంత పని పూర్తయిందని వివరాలు అడిగారని చెప్పారు. ఈ నేపథ్యంలో జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలను సంప్రదించ డంతోపాటు సంబంధిత అధికారులను కలిసి ఓటరు నమోదుకు సహక రించాలని కోరినట్లు వివరించారు. పట్టణాలు, గ్రామాల్లో పరిస్థితులు భిన్నంగా ఉంటాయని, గ్రామాల్లో గ్రాడ్యుయేట్ల వివరాలు తెలుసుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో అర్హుల ను గుర్తించి, వారితో దరఖాస్తులు చేయించాలని సూచించారు.పార్టీలో వేర్వేరు వర్గాలు లేవని, అందరిదీ కేసీ ఆర్ గ్రూపు, బీఆర్ఎస్ గ్రూపు మాత్రమేనని పల్లా స్పష్టం చేశారు. వ్యక్తిగత ప్రాధాన్యాలు, విభేదాల ను పక్కనపెట్టి పార్టీ విజయం లక్ష్యంగా పనిచే యాలన్నారు. ప్రతి గ్రామానికి కోఆర్డినేటర్లను నియమించి బాధ్యతలు అప్పగించాలని, ఇత రులు పనిచేస్తారనే ఉద్దేశంతో ఎవరూ తమ బాధ్యతల నుంచి తప్పుకోవద్దని సూచించారు. ఎవరు ఎంతమందిని ఓటర్లుగా నమోదు చేయించారనే దానికంటే, అర్హులైన వారందరినీ గుర్తించి నమోదు ప్రక్రియను పూర్తి చేయించడమే ముఖ్యమన్నారు. ఒకరు చేయలేదని మరొకరిపై నిందలు వేయకుండా, తమకు అప్పగించిన పనిని ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిర్వర్తించాలని కోరారు. పార్టీకి అనుకూలంగా ఉన్నవారితోపాటు తటస్థంగా ఉన్న అర్హులైన గ్రాడ్యుయేట్లను కూడా గుర్తించి ఓటర్లుగా నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని చెప్పారు.ఓటరు నమోదుకు డిగ్రీ సర్టిఫికెట్, నివాస ధ్రువీకరణ పత్రం, ఫొటో అవసరమని పల్లా వివరించారు. సంబంధిత నిబంధనలకు అనుగు ణంగా అవసరమైన పత్రాలను సమర్పించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. దరఖాస్తు చేసిన తర్వాత సంబంధిత అధికా రులు కోరిన పత్రాలను సమర్పించి, తదుపరి ప్రక్రియను పూర్తి చేయాల ని తెలిపారు. దరఖాస్తు చేయించడం 50 శాతం పనైతే, దానికి ఆమో దం పొందడం మిగిలిన 50 శాతం పనిగా భావించాలని చెప్పారు. దరఖాస్తు సమర్పించినంత మాత్రాన ఓటరు నమోదు పూర్తయినట్లు కాదని, ఆమోదం లభించే వరకు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.ప్రతి గ్రామంలో ఎంతమంది దరఖాస్తు చేశారో, ఎంతమందికి ఆమోదం లభించిందో వివరాలతో కూడిన జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. గ్రామాలవారీగా ఓటర్ల పేర్లు, అవసరమైన గుర్తింపు వివరాలు, సంప్రదింపు వివరాలను సేకరించి ఎన్నికల ఇన్‌చార్జి నాగూర్ల వెంకటేశ్వర్లుకు అందించాలని తెలిపారు. ఎంతమంది నమోదు అయ్యారనే విషయంలో స్పష్టమైన లెక్కలు ఉండాలని, చేపట్టిన పనికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు పార్టీ నాయకత్వానికి తెలియజేయాలని కోరారు.రాష్ట్రంలో కరువు పరిస్థితులు, సాగునీటి సమస్యలు, విద్యుత్ సరఫరా, రైతుబంధు, రైతుబీమా వంటి అంశాలను ప్రస్తావిస్తూ పల్లా రాజేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రఘునాథపల్లి మండలంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పోల్చుతూ తెలంగాణలో కరువు పరిస్థితులు ఎందుకు ఏర్పడ్డాయనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. గత ఎన్నికల్లోనూ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనుల విషయంలో ప్రజల్లో భయాలు కల్పించి ఓట్లు పొందేందుకు ప్రయత్నించారని విమర్శించారు. ఆర్టీసీ ఎన్నికల ఫలితాల్లో కార్మికులు తమ నిర్ణయాన్ని స్పష్టంగా వెల్లడించారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై అవగాహన కల్పిస్తూ పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు.ఈ నెల 30, 31 తేదీల్లోగా ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసేలా కృషి చేయాలని, నవంబర్ 1 నుంచి 6వ తేదీ వరకు దరఖాస్తుల ఆమోదంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. ప్రతి గ్రామంలో రోజుకు గంట లేదా రెండు గంటలు కేటాయించి గ్రాడ్యుయేట్లను గుర్తించడం, దరఖాస్తులు చేయించడం, వాటికి ఆమోదం పొందే వరకు పర్యవేక్షించడం వంటి పనులను సమన్వ యంతో చేపట్టాలని సూచించారు.కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటే ఈ ఎమ్మెల్సీ ఎన్నికను కీలకంగా తీసుకోవాలని, ఎన్నికలో విజయం సాధించేందుకు ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఒక ఆయుధంగా ఉపయోగించుకోవాలని పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో సమన్వయంతో పనిచేసి, అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

మంత్రి పొంగులేటిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ ఛైర్‌పర్సన్

జనగామ, మన ప్రజాపక్షం:
తెలంగాణ రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదినం సందర్భంగా జనగామ మున్సిపల్ ఛైర్‌పర్సన్ కడకంచి బాలమణి -- శ్రీనివాస్ మంత్రిని ప్రత్యేకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మంత్రికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి విశేష సేవలందించాలని ఆకాంక్షించారు.
జనగామ అభివృద్ధికి మంత్రి సహకారం అభినందనీయం!
జనగామ పట్టణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే రూ.25 కోట్ల నిధులు మంజూరు చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి ఛైర్‌పర్సన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులు పట్టణ అభివృద్ధికి మరింత ఊతమివ్వనున్నాయని పేర్కొన్నారు.అదేవిధంగా జనగామ పట్టణంలో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితర ప్రజావసరాలకు సంబంధించిన మరిన్ని పనులు చేపట్టేందుకు అదనపు నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. జనగామ పట్టణ అభివృద్ధిపై ఛైర్‌పర్సన్ చేసిన విజ్ఞప్తికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు.
జనగామ ప్రగతే లక్ష్యం-ప్రజల సంక్షేమమే ధ్యేయం!
జనగామ పట్టణాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఛైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ స్పష్టం చేశారు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ, ప్రభుత్వ సహకారంతో జనగామ పట్టణ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు.జనగామ పట్టణ అభివృద్ధికి సహకరిస్తూ, అదనపు నిధుల మంజూరుపై


సానుకూలంగా స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి మరోసారి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.



రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జాయింట్ సెక్రటరీగా సాగర్ల శివరావు

చిలుకూరు,మన ప్రజాపక్షం:
రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జాయింట్ సెక్రటరీగా చిలుకూరు మండలం అర్లేగూడెం గ్రామ రేషన్ డిలర్ సాగర్ల శివరావు నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు నాయకోటి రాజు, అధ్యక్షతన ఎన్నుకోవడం జరిగింది. శివరావు నియామకం పట్ల చిలుకూరు మండల రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. జిల్లా రేషన్ డీలర్ల అధ్యక్షుడు కనుమర్లపూడి శ్రీనివాసరావు, కార్యదర్శి ఖాజా మొయినుద్దీన్, కోదాడ ఐఎంజీ ప్రెసిడెంట్ ఆంజనేయులు, మండల రేషన్ డీలర్ల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, మండల ట్రెజరర్ నాగేశ్వరరావు,రెమిడాల ఆనందరావు, తిపిరిశెట్టి దశరథ, గూగులోతు నాగేశ్వరరావు, గజ్జి వెంకటేశ్వర్లు, నక్క నాగరాజు, శ్రీను, వెంకయ్య,వై.సత్యం, వేమూరి పద్మావతి కృష్ణయ్య తదితరులు శివరావుకు శుభాకాంక్షలు తెలిపారు.రాష్ట్రస్థాయి కార్యవర్గంలో బాధ్యతలు చేపట్టిన శివరావు రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కమిటీకి సాగర్ల శివరావు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం
విశ్రాంత ఉద్యోగులతో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి సమావేశమై వారి సమస్యలు, సాధకబాధకాలను తెలుసుకున్నారు.నూతన హెల్త్ కార్డుల జారీ, వైద్య సేవల్లో ఎదురవుతున్న ఇబ్బందుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.విశ్రాంత ఉద్యోగులందరికీ హెల్త్ కార్డుల ద్వారా మెరుగైన ఉచిత వైద్యం అందేలా రాష్ట్ర అధికారులతో చర్చిస్తానని వెల్లడించారు.ప్రభుత్వ పరంగా విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిల పరిష్కారంపై ముఖ్యమంత్రితో చర్చిస్తానని తెలిపారు.వృద్ధాప్యంలో ఉన్న విశ్రాంత ఉద్యోగులకు ఎల్లవ్వుడూ అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు.విశ్రాంత ఉద్యోగులు ఎవ్వుడైనా తనను సంప్రదించవచ్చని ఎమ్మెల్సీ తెలిపారు.సంఘ కార్యాలయం నిర్వహణపై అభినందనలు తెలిపి, తరచూ కార్యాలయాన్ని సందర్శించి సమస్యలను తెలుసుకుంటానని వెల్లడించారు.గౌరవ డాక్టరేట్ పొందిన విశ్రాంత ఉద్యోగి వంకేశ్వరం నిరంజన్‌కు శాలువాతో సన్మానం చేశారు.కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ తీగల సురేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, కౌన్సిలర్ పడిగ శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటశెట్టి, మలిశెట్టి పద్మమ్మ, వార్డెన్ చెన్నయ్య, పోల శ్రీనివాసులు, పెద్ద సంఖ్యలో విశ్రాంత ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:
నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి హాజరై డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.యువత భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు.మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.అనంతరం విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సునేంద్ర కుమార్, రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు రాజ మహేందర్ రెడ్డి, డాక్టర్ రోహిత్ కుమార్,కళాశాల కరస్పండెంట్ ఉదయ్ కుమార్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సంస్థాగత బలోపేతంపై విస్తృత స్థాయి సమీక్ష

కమిటీల నియామకాలు త్వరగా పూర్తి చేయాలి: రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్

అక్టోబర్ 28, శేరిలింగంపల్లి

శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని ఆల్విన్ కాలనీ డివిజన్ పార్టీ కార్యాలయంలో బీజేపీ సంస్థాగత కమిటీల నిర్మాణం, రాబోయే రాజకీయ కార్యక్రమాలపై విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవికుమార్ యాదవ్, రంగారెడ్డి అర్బన్ జిల్లా ఇన్‌చార్జ్ ఆలే భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వీరేందర్ గౌడ్ మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటన సందర్భంగా నిర్వహించనున్న మహా పాదయాత్రను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి డివిజన్‌లో నూతన కార్యవర్గాలు, కార్యనిర్వాహక కమిటీల నియామకాలను త్వరగా పూర్తి చేసి పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని సూచించారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అర్హులైన ఓటర్ల నమోదును వేగవంతం చేయాలని రవికుమార్ యాదవ్ కోరారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని సూచించారు.ఆలే భాస్కర్ మాట్లాడుతూ డివిజన్ కమిటీలు, బూత్ స్థాయి కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి విధానాలను వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో మహిపాల్ రెడ్డి, రవీందర్ రావు, వంశీ రెడ్డి, బాలు యాదవ్, రఘు, రాజు, అనిల్ గౌడ్, నర్సింగ్ యాదవ్, సీతారామరాజు, కృష్ణంరాజు, డివిజన్ అధ్యక్షులు, నూతన కార్యవర్గ సభ్యులు, వివిధ మోర్చాల బాధ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





నారాయణఖేడ్‌లో బీజేపీ ఆధ్వర్యంలో మేధావుల సమావేశం

ఓటరు జాబితాల ప్రక్షాళనతో ప్రజాస్వామ్యం బలోపేతం: విజయపాల్ రెడ్డి

అక్టోబర్ 28, నారాయణఖేడ్ :

నారాయణఖేడ్‌లోని వారాహి బ్యాంకెట్ హాల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో మేధావుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయపాల్ రెడ్డి ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ) ప్రక్రియ గురించి వివరించారు.మాజీ ఎమ్మెల్యే విజయపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పెంపొందించేందుకు ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ కీలకమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడుతూ, నిబంధనలకు విరుద్ధంగా నమోదైన ఓట్లను తొలగించడమే ఈ ప్రక్రియ ఉద్దేశమని తెలిపారు. ఓటరు జాబితాల ప్రక్షాళన ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని అన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ అనవసరంగా విమర్శలు చేస్తోందని విజయపాల్ రెడ్డి ఆరోపించారు. ఈ సమావేశంలో పలువురు మేధావులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరు మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలి: సీపీఎం డిమాండ్

ఎకరాకు రూ. 50 వేల నష్టపరిహారం చెల్లించాలి
ఎండిపోయిన పంటలను పరిశీలించిన సీపీఎం బృందం

అక్టోబర్ 28,
యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన ఆత్మకూరు మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించి, రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి పాండు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో ఎండిపోయిన పంట పొలాలను నాయకులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా దాసరి పాండు మాట్లాడుతూ... తీవ్ర వర్షాభావ ప్రభావంతో మండలంలో వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాన్నే నమ్ముకుని జీవిస్తున్న రైతులు, వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతులు దుక్కులు దున్నడం, విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కోసం వేలాది రూపాయలు అప్పులు తెచ్చి పెట్టుబడిగా పెట్టారని, పంట చేతికి వచ్చాక అప్పులు తీర్చుకుందామనుకున్న తరుణంలో వర్షాలు లేక పంటలు ఎండిపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారని వాపోయారు.ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న అరకొర సాయం కాకుండా, ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ. 50,000 చొప్పున నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి మండలవ్యాప్తంగా ఎండిపోయిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టపోయిన రైతుల పేర్లను నమోదు చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకపోతే రైతుల పక్షాన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం, మండల కమిటీ సభ్యులు తుమ్మల సత్యనారాయణ రెడ్డి, మల్లెల శ్రీశైలం, నాయకులు కృష్ణారెడ్డి, జగ్గం అచ్చయ్య, ఎల్లయ్య, మధుసూదన్ రెడ్డి, శ్రీశైలం, నరసింహ, ఏపూరి బుగ్గ రాములు, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.





బ్యాలెట్ ఎన్నికల్లో 28 స్థానాల్లోనూ సున్నా.. ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రం

నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ఒక్క సీటూ దక్కలేదు!

అక్టోబర్ 28,సెంట్రల్ డెస్క్:

నాలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క స్థానంలోనూ విజయం సాధించలేదని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, కర్ణాటక రాష్ట్రాల్లో మొత్తం 28 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన సీట్లెన్ని అంటూ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వ్యంగ్యంగా ప్రశ్నించారు. ఈ ఎన్నికలు బ్యాలెట్ పత్రాల ద్వారా జరిగాయని ప్రస్తావించారు.కర్ణాటకలో జరిగిన నాలుగు స్థానాల్లో బీజేపీ మూడు, జేడీఎస్ ఒక స్థానాన్ని గెలుచుకున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ఐదు, సమాజ్‌వాదీ పార్టీ రెండు స్థానాల్లో విజయం సాధించాయి. బీహార్‌లో బీజేపీ, ఆర్జేడీ, జన్ సురాజ్ పార్టీ, ఒక స్వతంత్ర అభ్యర్థి ఒక్కో స్థానాన్ని గెలుచుకున్నట్లు నివేదిక పేర్కొంది. మహారాష్ట్రలోనూ కాంగ్రెస్ విజయం సాధించలేదని తెలిపింది.ఎన్నికల అక్రమాలు, ఓటరు జాబితా సవరణ అంశాలపై కాంగ్రెస్ జాతీయ స్థాయిలో పోరాటం చేస్తున్న నేపథ్యంలో ఈ ఫలితాలు రాజకీయ చర్చకు దారితీశాయి. అయితే, నాలుగు రాష్ట్రాల్లోని 28 స్థానాల ఎన్నికల ఫలితాలపై వచ్చిన వివరాలను అధికారిక ఎన్నికల గణాంకాలతో ధ్రువీకరించుకోవాల్సి ఉంది.

రైళ్లలో రాత్రిపూట ఛార్జింగ్ బంద్.. భద్రతపై రైల్వే బోర్డు కీలక ఆదేశాలు

రైలు ప్రయాణికుల భద్రతను మరింత కట్టుదిట్టం చేసే దిశగా భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. రైళ్లలోని అన్ని కోచ్‌లలో రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు మొబైల్, ల్యాప్‌టాప్ ఛార్జింగ్ పాయింట్లను తప్పనిసరిగా స్విచ్ ఆఫ్ చేయాలని రైల్వే బోర్డు అన్ని జోనల్ కార్యాలయాలకు అక్టోబర్ 26న ఆదేశాలు జారీ చేసింది. అగ్నిప్రమాదాల నివారణే లక్ష్యంగా ఈ నిబంధనను ఎలాంటి మినహాయింపులు లేకుండా కఠినంగా అమలు చేయాలని స్పష్టం చేసింది.ఇటీవల సౌత్ ఈస్టర్న్ రైల్వే పరిధిలోని ఓ రైలులో రాత్రిపూట ఛార్జింగ్ పెట్టిన ప్రయాణికుడి పవర్ బ్యాంక్ పేలి పొగలు వ్యాపించాయి. నిబంధనల ప్రకారం ఆ సమయంలో ఛార్జింగ్ పాయింట్లను సిబ్బంది నిలిపివేయాల్సి ఉన్నా, వారు నిర్లక్ష్యం చేయడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటనను తీవ్రంగా పరిగణించిన రైల్వే బోర్డు, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా పాత నిబంధనను కఠినంగా అమలు చేయాలని నిర్ణయించింది.వాస్తవానికి ఈ నిబంధన కొత్తదేమీ కాదు. 2013లో హుజూర్ సాహిబ్ నాందేడ్ – కేఎస్ఆర్ బెంగళూరు ఎక్స్‌ప్రెస్ ఏసీ కోచ్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదం తర్వాత, రైల్వే భద్రతా కమిషనర్ సిఫార్సుల మేరకు 2014లోనే రైల్వే బోర్డు ఈ నిబంధనను అమల్లోకి తెచ్చింది. ప్రయాణికుల సౌకర్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని రాత్రి 11 నుంచి ఉదయం 5 గంటల వరకు ఛార్జింగ్ పాయింట్లను ఆఫ్ చేయాలని అప్పట్లో నిర్ణయించారు. అయితే, కొన్నిచోట్ల ఇది సరిగా అమలు కావడం లేదని బోర్డు గుర్తించిందితాజా ఆదేశాల ప్రకారం, ఈ నిబంధన అమలును పర్యవేక్షించేందుకు సిబ్బందికి సరైన శిక్షణ ఇవ్వాలని, అధికారులు, సూపర్‌వైజర్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని రైల్వే బోర్డు స్పష్టం చేసింది. రాత్రిపూట ఛార్జింగ్ వల్ల అగ్నిప్రమాదాలే కాకుండా, విలువైన వస్తువుల దొంగతనం జరిగే ప్రమాదం కూడా ఉందని గతంలోనే పలు రైల్వే జోన్లు హెచ్చరించిన నేపథ్యంలో ఈ చర్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

కాంగ్రెస్ బహిరంగ క్షమాపణ చెప్పాలి: కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు

చైనా చొరబాట్లపై నకిలీ వీడియోలు ప్రచారం చేశారంటూ కాంగ్రెస్‌పై ఆరోపణలు

అక్టోబర్ 28,
సెంట్రల్ డెస్క్:

అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా చొరబాట్లకు సంబంధించినవంటూ కాంగ్రెస్ నాయకులు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసిన వీడియోలపై వివాదం నెలకొంది. ఆ వీడియోలు తప్పుదారి పట్టించేలా ఉన్నాయని భారత సైన్యం స్పష్టం చేసినట్లు కథనంలో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై స్పందించిన కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసినందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.కథనం ప్రకారం, ప్రచారంలో ఉన్న వీడియోల్లో ఒకటి సిక్కిం సరిహద్దులోని నాథూలా కనుమ వద్ద సాధారణ వాణిజ్య రాకపోకలకు సంబంధించినదని, మరో వీడియో 2023లో జమ్మూ కశ్మీర్‌లోని కుప్వారాలో నిర్వహించిన విలేకరుల సమావేశానికి సంబంధించిన పాత దృశ్యాలని సైన్యం వివరణ ఇచ్చింది. సైనికాధికారి లెఫ్టినెంట్ జనరల్ గిరీష్ కాలియాకు ఆపాదించిన వ్యాఖ్యలు వాస్తవమైనవి కావని కూడా పేర్కొన్నట్లు కథనం తెలిపింది. ఈ వీడియోలను ఉపయోగించి అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా ఆక్రమణలకు సంబంధించిన తప్పుడు ప్రచారం జరిగిందని బీజేపీ నాయకులు విమర్శించారు.దేశ భద్రత, సైనికుల గౌరవానికి సంబంధించిన అంశాలపై రాజకీయ పార్టీలు బాధ్యతగా వ్యవహరించాలని రిజిజు సూచించారు. మరోవైపు, కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘం ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు వినోద్ జఖర్ వీడియోలు మార్పులు చేసినవేనని అంగీకరిస్తూనే, వాటిలో ప్రస్తావించిన అంశాలు వాస్తవమైనవేనని వాదించినట్లు కథనంలో పేర్కొన్నారు. సరిహద్దు భద్రతపై ప్రజలకు సమాచారం అందించే ముందు వీడియోల వాస్తవికతను, అధికారిక ఆధారాలను పరిశీలించాల్సిన అవసరాన్ని ఈ వివాదం మరోసారి ముందుకు తెచ్చింది.



భారత పైలట్ స్మిత్ మచ్చర్‌కు యూఏఈ అత్యున్నత పురస్కారం

180 మంది ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన కెప్టెన్ స్మిత్ మచ్చర్‌కు అరుదైన గౌరవం

అక్టోబర్ 28, సెంట్రల్ డెస్క్:

భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌కు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం అరుదైన గౌరవాన్ని అందించింది. విమానంలో చోటుచేసుకున్న ప్రమాదకర ఘటనలో 180 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడినందుకు ఆయనకు 'ఫస్ట్ క్లాస్ ఆర్డర్ ఆఫ్ జాయెద్ ××' పురస్కారాన్ని ప్రదానం చేసింది. యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ సమక్షంలో దుబాయ్ యువరాజు హమ్దాన్ బిన్ మహమ్మద్ అల్ మక్తూమ్ ఈ పురస్కారాన్ని అందజేసినట్లు కథనం పేర్కొంది. విమాన సిబ్బందిని కూడా ఈ సందర్భంగా సత్కరించారు.దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు ప్రయాణిస్తున్న ఫ్లైదుబాయ్‌కు చెందిన బోయింగ్ 737 మ్యాక్స్ 8 విమానంలో సహ పైలట్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రమాదకర చర్యను అడ్డుకునే క్రమంలో స్మిత్ మచ్చర్ గాయపడినట్లు నివేదిక తెలిపింది. కత్తిపోట్లకు గురైన ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం కోలుకుంటున్నట్లు పేర్కొంది. క్లిష్ట పరిస్థితుల్లో ప్రయాణికులను రక్షించేందుకు చూపిన ధైర్యసాహసాలను యూఏఈ ప్రభుత్వం ప్రశంసించింది.ఇప్పటికే స్మిత్ మచ్చర్‌కు ఇజ్రాయెల్ ప్రభుత్వం 'ప్రెసిడెన్షియల్ అవార్డ్ ఫర్ సివిలియన్ హీరోయిజం'ను ప్రకటించగా, గుజరాత్ ప్రభుత్వం కూడా 'గుజరాత్ గరిమా అవార్డు'కు ఎంపిక చేసినట్లు కథనం వెల్లడించింది. ప్రయాణికుల భద్రత కోసం ఆయన చేసిన కృషికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం విశేషంగా నిలిచింది.



‘రావణుడు పూర్తిగా చెడ్డవాడు కాదు’..

సాయిపల్లవి వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో చర్చ!

‘రామాయణం’లో సీతగా నటించిన సాయిపల్లవి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. రావణుడి గురించి ఆమె చేసిన వ్యాఖ్యలపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తుండగా.. మరికొందరు ఆమె చెప్పిన విషయాన్ని సమర్థిస్తున్నారు. లాస్ ఏంజెలెస్‌లో జరిగిన ‘రామాయణం’ సినిమా ప్రీమియర్ సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. భారతీయ సంస్కృతి, ఇతిహాసాలపై ఆసక్తి ఉన్నవారికి తమ సినిమా మంచి పరిచయంగా నిలుస్తుందని సాయిపల్లవి అన్నారు. ‘రామాయణం’ను విశ్వసించే వారు ఆ కథ నుంచి తమను తాము పరిశీలించుకోవడం నేర్చుకోవాలని చెప్పారు. మనలోని మంచి, చెడులను గుర్తించి కాలక్రమంలో మార్పు తెచ్చుకోవాలని సూచించారు. ఈ క్రమంలోనే ‘రావణుడు పూర్తిగా చెడ్డవాడు కాదు. మనలోని రావణుడిని గుర్తించి, మనల్ని మనం మార్చుకోవడం ముఖ్యం’ అని వ్యాఖ్యానించారు. ఆమె మాటలపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. రావణుడి గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని కొందరు అభిప్రాయపడుతున్నారు. మరికొందరు మాత్రం ఆమె ఉద్దేశం రావణుడిని సమర్థించడం కాదని, మనలోని చెడు లక్షణాలను గుర్తించి సరిదిద్దుకోవాలనే సందేశమని అంటున్నారు. రావణుడిలోని కొన్ని మంచి లక్షణాలను ప్రస్తావించడం తప్పు కాదని మరికొందరు సమర్థిస్తున్నారు.నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, యశ్ రావణుడిగా నటించారు. ఈ సినిమా తొలి భాగం నవంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా విడుదలకు ముందే సాయిపల్లవి వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.



అమ్మాయిలు అదరహో.. జింబాబ్వేపై భారత్ క్లీన్ స్వీప్



భారత మహిళల క్రికెట్ జట్టు జింబాబ్వేపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. వడోదరలోని బీసీఏ స్టేడియంలో బుధవారం జరిగిన మూడో, చివరి వన్డేలో 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ కేవలం 26 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించి భారత విజయంలో కీలకపాత్ర పోషించింది.తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వేను భారత బౌలర్లు 131 పరుగులకే కట్టడి చేశారు. వైష్ణవి శర్మ 39 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి తన వన్డే కెరీర్‌లో తొలిసారి ఈ ఘనత సాధించింది. సయాలీ సత్ఘరే, క్రాంతి గౌడ్ చెరో రెండు వికెట్లు తీశారు. జింబాబ్వే జట్టులో మోడెస్టర్ ముపాచిక్వా (37), జోసెఫిన్ కోమో (35) మాత్రమే రాణించారు.అనంతరం 132 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్, కేవలం 17 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. షఫాలీ వర్మ 26 బంతుల్లో 51 పరుగులతో అజేయంగా నిలవగా, మరో ఓపెనర్ ప్రతికా రావల్ (59 నాటౌట్) నిలకడగా ఆడి జట్టును విజయతీరాలకు చేర్చింది. ఈ క్రమంలో షఫాలీ.. వన్డేల్లో భారత మహిళల తరఫున అత్యంత వేగంగా రెండో హాఫ్ సెంచరీ (రిచా ఘోష్‌తో సమానంగా) నమోదు చేసింది. యస్తికా భాటియా డకౌట్ కాగా, హర్లీన్ డియోల్ 19 పరుగులు చేసింది.అంతకుముందు టీ20 సిరీస్‌ను కూడా గెలుచుకున్న భారత్, ఒక్క ఓటమి కూడా లేకుండా రెండు సిరీస్‌లను సొంతం చేసుకుంది. మరోవైపు, జింబాబ్వే జట్టు ఒక్క విజయం కూడా నమోదు చేయకుండానే పర్యటనను ముగించింది.

SPORTS

ఆ సీమయంలో అతడి సినిమాలే
నాకు ఉపశమనం: రోహిత్ శర్మ



టీమిండియా మాజీ కెప్టెన్, హిట్ మ్యాన్ రోహిత్ శర్మ తన జీవితంలోని ఒక ఆసక్తికరమైన అంశాన్ని పంచుకున్నాడు. క్రికెట్ మైదానంలో ఎదురయ్యే తీవ్రమైన ఒత్తిడి, వైఫల్యాల నుంచి బయటపడటానికి తనకు బాలీవుడ్ ప్రముఖ హాస్యనటుడు రాజ్‌పాల్ యాదవ్ సినిమాలు ఎలా స్ఫూర్తినిస్తాయో వివరించాడు. తాను హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ‘ఫ్యామిలీ ఫుల్ హౌస్’ షో తాజా ఎపిసోడ్‌లో రోహిత్ ఈ విషయాలు వెల్లడించాడు.ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ.. “నేను ఔట్ అయినప్పుడు లేదా మ్యాచ్ ఓడిపోయినప్పుడు చాలా బాధగా ఉంటుంది. అలాంటి సమయంలో హోటల్‌కు వెళ్లాక మీ సినిమాలు చూస్తాను. అవి చూశాక, మరుసటి రోజు ఉదయం లేచేసరికి నిన్న ఏమీ జరగనట్టే అనిపిస్తుంది. నేను త్వరగా ఔట్ అయ్యానన్న భావనే ఉండదు” అని రాజ్‌పాల్ యాదవ్‌తో అన్నాడు. ఆయన కామెడీ చిత్రాలు తనను అంతగా సేదతీరుస్తాయని రోహిత్ తెలిపారు.తాను రాజ్‌పాల్ యాదవ్‌కు ఎంత పెద్ద అభిమానో చెప్పడానికి తన దగ్గర రుజువు కూడా ఉందని రోహిత్ పేర్కొన్నారు. “మీరు రుజువు చూడాలనుకుంటున్నారా?” అని అడిగి, 2016 నాటి ఒక ప్రత్యేక వీడియోను ప్లే చేశారు. ఆ వీడియోలో, అప్పట్లో అందుబాటులో ఉన్న ఒక మొబైల్ యాప్ ఉపయోగించి రాజ్‌పాల్ యాదవ్ చెప్పిన డైలాగ్స్‌కు రోహిత్ లిప్ సింక్ ఇస్తూ కనిపించారు.ఆ వీడియో నాటి జ్ఞాపకాలను పంచుకుంటూ, “ఇది 2016 నాటి విషయం. అప్పట్లో వీడియోలు క్రియేట్ చేయడానికి ఒక యాప్ ఉండేది. మ్యాచ్ ఆడిన తర్వాత హోటల్‌లో ఖాళీగా ఉన్నప్పుడు ఇలాంటివి చేసేవాళ్లం. ఇదే నా అభిమానానికి రుజువు. ఇది దాదాపు పదేళ్ల క్రితం నాటి సంగతి” అని రోహిత్ వివరించారు. కాగా, రోహిత్ శర్మ హోస్ట్ చేస్తున్న ఈ ‘ఫ్యామిలీ ఫుల్ హౌస్’ కార్యక్రమం సోనీ ఎంటర్‌టైన్‌మెంట్ టెలివిజన్‌లో ప్రతి శని, ఆదివారాల్లో రాత్రి 9:30 గంటలకు ప్రసారమవుతోంది. సోనీ లివ్‌లో కూడా ఇది స్ట్రీమింగ్ అవుతోంది.

ఇంగ్లండ్ ఆటగాడితో వాగ్వాదం..
పాక్ బౌలర్‌కు భారీ జరిమానా..

ఇంకోసారి జరిగితే నిషేధమే!



పాకిస్థాన్ ఫాస్ట్ బౌలర్ హరీస్ రవూఫ్‌కు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) షాక్ ఇచ్చింది. మైదానంలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు మ్యాచ్ ఫీజులో 20 శాతం జరిమానా విధించింది. అంతేకాదు.. అతడి ఖాతాలో మరో డీమెరిట్ పాయింట్ చేరింది. దీంతో మొత్తం పాయింట్లు ఐదుకు చేరాయి. ఇప్పటికే గతంలో నిషేధం ఎదుర్కొన్న రవూఫ్.. మరోసారి నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉంది.

అసలేం జరిగింది?

ఇంగ్లండ్‌తో ఆదివారం లాహోర్‌లో జరిగిన వన్డేలో ఈ ఘటన చోటుచేసుకుంది. పాకిస్థాన్ ఇన్నింగ్స్ 46వ ఓవర్ ముగిసిన సమయంలో వైడ్ కోసం రవూఫ్ అప్పీల్ చేశాడు. ఈ విషయంలో ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ విల్ జాక్స్‌తో వాగ్వాదానికి దిగాడు. అంపైర్ షర్ఫుద్దౌలా హెచ్చరించినా రవూఫ్ వెనక్కి తగ్గలేదు. బ్యాట్ పైకెత్తుతూ వాదన కొనసాగించాడు. జాక్స్ వైపు వెళుతూ అంపైర్‌ను తాకుతూ ముందుకు సాగాడు. ఈ వ్యవహారాన్ని ఐసీసీ తీవ్రంగా పరిగణించింది.

ఐదు డీమెరిట్ పాయింట్లు

24 నెలల వ్యవధిలో రవూఫ్ మూడోసారి తప్పిదానికి పాల్పడ్డాడు. తాజా చర్యతో అతడి ఖాతాలో ఐదు డీమెరిట్ పాయింట్లు చేరాయి. ఐసీసీ నిబంధనల ప్రకారం ఈ వ్యవధిలో నాలుగు పాయింట్లు వస్తే రెండు సస్పెన్షన్ పాయింట్లుగా మారతాయి. దాని ప్రకారం ఒక టెస్టు లేదా రెండు వన్డేలు లేదా రెండు టీ20లపై నిషేధం పడుతుంది. ఎనిమిది డీమెరిట్ పాయింట్లకు చేరితే శిక్ష మరింత పెరుగుతుంది.ఇదే మ్యాచ్‌లో ఇంగ్లండ్‌కూ జరిమానా పడింది. నిర్ణీత సమయంలో మూడు ఓవర్లు తక్కువగా వేసినందుకు ఆ జట్టు ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించారు. ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్, రవూఫ్ తమపై వచ్చిన అభియోగాలను అంగీకరించడంతో అధికారిక విచారణ అవసరం లేకుండానే ఐసీసీ శిక్షలు ఖరారు చేసింది. ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ ఒక్క వికెట్ తేడాతో ఇంగ్లండ్‌పై గెలిచింది. షాదాబ్ ఖాన్ అజేయ సెంచరీకి తోడు చివరి వికెట్‌కు రవూఫ్‌తో కలిసి 89 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. దీంతో పాకిస్థాన్ త్రైపాక్షిక వన్డే సిరీస్ ఫైనల్‌కు చేరింది. అక్టోబరు 31న లాహోర్‌లో శ్రీలంకతో తలపడనుంది.